## ఇండ్ల స్థలాల కోసం కలెక్టరేట్ ఎదుట ధర్నా

భువనగిరి కలెక్టరేట్/ఆలేరురూరల్, మార్చి 5 : అర్హులైన నిరుపేదలకు ప్రభుత్వ భూమిలో ఇంటి స్థలాలు ఇవ్వాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు చెక్క వెంకటేశ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆలేరు మండలం కొలనుపాక గ్రామంలో సర్వే నంబర్ 8లోని రెండెకరాల ప్రభుత్వ భూమి అర్హులైన పేదలకు ఇవ్వాలని కోరుతూ బుధవారం కలెక్టరేట్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించి మాట్లాడారు. గ్రామంలో అర్హులైన పేదలు అనేక రోజుల నుంచి అద్దె ఇండ్లల్లో ఉంటూ కిరాయిలు కట్టలేక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం డబుల్ బెడ్రూం ఇండ్లు కట్టించిన దాని పక్కన ప్రభుత్వ స్థలం రెండు ఎకరాల భూమి ఉందని, గతంలో సైతం ఆలేరు ఎమ్మార్వో కార్యాలయం ముందు ధర్నా చేసి వినతి పత్రం అందజేసినా ఫలితం లేదని తెలిపారు. ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు తుంగలో తొక్కిందని మండిపడ్డారు. ప్రజా పాలనలో దరఖాస్తులు పెట్టుకున్నా అర్హులైన పేదలకు ఇంటి స్థలాలు, ఇందిరమ్మ ఇండ్లు రాలేదన్నారు. అనంతరం పలు సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని కలెక్టర్ కార్యాలయ అధికారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి దడబోయిన కనకయ్య, శాఖ కార్యదర్శి పొన్నబోయిన రవి, గిరబోయిన స్వామి, నాయకులు పోతు ప్రవీణ్, మోతె భవాని, సంపత్, లక్ష్మి, భిక్షపతి, కవిత, ఉప్పలమ్మ, యాదమ్మ, లక్ష్మి, ఎల్లమ్మ తదితరులు పాల్గొన్నారు.

## పొన్నవాహనంపై లక్ష్మీనరసింహుడు

- గుట్టలో వైభవంగా బ్రహ్మోత్సవాలు



పొన్నవాహనంపై లక్ష్మీ నరసింహస్వామి

యాదగిరిగుట్ట, మార్చి 5 : యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. బుధవారం రాత్రి ప్రధానాలయంలో నిత్యకైంకర్యాల అనంతరం స్వామివారిని పొన్న వాహన సేవలో తిరుమాఢవీధుల్లో ఊరేగించారు. అనంతరం పశ్చిమ దిశలోని వేంచేపు మండపంలో స్వామివారిని అధిష్ఠించారు. నాలుగు వేదాలు, పొన్నవాహనసేవ సూక్తులను పఠించారు. వాహన సేవ వైభవ ప్రాశురాలను పఠిస్తూ స్వామి వారి విశిష్టతను ప్రధానార్చకుడు నల్లన్‌థిఘళ్ లక్ష్మీ నరసింహాచార్యులు వివరించారు. పొన్న వృక్షాన్ని దైవ వృక్షంగా పురాణాలు పేర్కొన్నాయని ఆయన తెలిపారు. స్వామివారు గురువారం ఉదయం గోవర్ధనగిరిధారిగా దర్శనం ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. రాత్రికి సింహవాహన సేవపై తిరుమాఢవీధుల్లో ఊరేగనున్నారు. కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్త బి. నరసింహమూర్తి, ఈఓ భాస్కర్ రావు, డీఈఓ దోర్బల భాస్కర్ శర్మ, ఆలయ ప్రధానార్చకులు కాండూరి వేంకటాచార్యులు, రుత్వికులు, పారాయణికులు, ముఖ్య అర్చకులు, యజ్ఞీకులు, ఏఈఓలు పాల్గొన్నారు.

# నీళ్లు లేక పండని పల్లీ

**అడుగంటిన భూగర్భజలంతో వట్టిపోయిన బోర్లు**

- ఎకరాకు రూ.30వేల వరకు పెట్టుబడి
- చందంపేట మండలంలో వాడిపోతున్న పంట.. భారీగా తగ్గిన దిగుబడి
- ఈసారి అప్పుల పాలేనంటున్న రైతులు
- కౌలు రైతుల పరిస్థితి మరింత దుర్భరం



చందంపేట మండలం ముడుదండ్ల గ్రామంలో ఎండిన పల్లీసాగు

చందంపేట, మార్చి 5 : వేసవికి ముందే భూగర్భ జలాలు అడుగంటడంతో పల్లికాయ సాగు చేసిన రైతుల కష్టం మట్టిపాలు అవుతున్నది. కలిసి వస్తుందనుకున్న పంట బోరు బావుల్లో నీళ్లు ఇంకిపోయిన కారణంగా కండ్ల ముందే ఎండిపోతుండడంతో రైతులు తల్లడిల్లుతున్నారు. చందంపేట మండలంలో రైతులు పత్తి తర్వాత అధికంగా పల్లికాయ(పల్లీ) సాగు చేస్తారు. ఏటా లాభాలు తెచ్చిపెడుతున్న పంట ఈ సారి రైతులను నిండా ముంచుతున్నది. భూగర్భ జలాలు అడుగంటడంతో బోర్లు వట్టిపోయి చేలకు నీళ్లు అందం లేదు. దాంతో మొక్కలు వాడుబడుతున్నాయి. గింజ సరిగ్గా పోసుకోవడం లేదు. పెట్టిన పెట్టుబడి కూడా వెళ్లే పరిస్థితి లేదని, అప్పులే మీద పడేట్టు ఉన్నాయని రైతులు వాపోతున్నారు.

చందంపేట మండలంలో గతంతో పోల్చితే పల్లికాయ సాగు తగ్గింది. గతంలో సుమారు 16,680 ఎకరాల్లో సాగు చేయగా, ఈసారి 12,456 ఎకరాల్లో వేశారు. మిగతా విస్తీర్ణంలో రైతులు వరి సాగు చేశారు. ప్రస్తుతం భూగర్భ జలాలు ఇంకిపోవడంతో మొక్కలు నీళ్లు సరిపోవడం లేదు. ఒక మొక్కకు 20 నుంచి 30 కాయలు కాయల్సి ఉండగా, 5 నుంచి 10 లోపు మాత్రమే ఉంటున్నాయి. దాంతో దిగుబడి విపరీతంగా తగ్గిపోతున్నది. రైతులు ఒక ఎకరా సాగుకు రూ.30వేల వరకు ఖర్చు చేశారు. ప్రస్తుతం మార్కెట్లో క్వింటా పల్లికాయ రూ.6వేల నుంచి రూ.6,500 మాత్రమే ధర పలుకుతున్నది. ప్రభుత్వ పరంగా కొనుగోళ్లు లేకపోవడంతో మద్దతు ధర మాటే లేకపోతున్నది. దాంతో దళారులకు అమ్ముకోవాల్సిన పరిస్థితి నెలకొంది. కాగా, విత్తనాల కోసమే క్వింటాకు రూ.12వేల నుంచి రూ.13వేల వరకు చెల్లించాల్సి వచ్చిందని రైతులు వాపోతున్నారు. ప్రభుత్వం స్పందించి తమను ఆదుకోవాలని ప్రాధేయపడుతున్నారు.



### పెట్టుబడి కూడా వెళ్లేట్లు లేదు



నాకున్న ఆరెకరాల్లో పల్లికాయ సాగు చేసిన. మొత్తం పెట్టుబడి లక్షా పాతిక వేలు వచ్చింది. పంటకు నీళ్లు లేకపోవడం, ఎండలు ముదరడంతోని దిగుబడి సరిగ్గా లేదు. కాని నాకు పెట్టుబడి కూడా వస్తదో రాదో అని అనుమానంగా ఉంది. ఆరెకరాల మీద 20 క్వింటాళ్ల పల్లికాయ అయినా వస్తదా, లేదా అన్నట్టు ఉంది. లాభం మాట దేవుడెరుగు.. మా కష్టానికి కూడా ఫలితం దక్కదు. పల్లికాయ తీసుకుంటే కూలీ ఖర్చులు పోనూ అంతగా మిగిలేదేమీ ఉండదు.

*– పందిరి రామేశ్వరి, రైతు, ముడుదండ్ల*



### కౌలుపోనూ కష్టం వృథా

మా తండాలో 16 ఎకరాలు కౌలుకు తీసుకొని పల్లికాయ సాగు చేశాను. ఏటా వంద క్వింటాళ్లకు పైగా దిగుబడి వచ్చేది. ఈసారి భగర్భ జలాలు అడుగంటడంతో చేనుకు నీళ్లు అందించడం కష్టమైంది. ఇప్పుడు 60 క్వింటాళ్ల దిగుబడి రావడం కూడా కష్టమే. కౌలుకు భూమి ఇచ్చిన రైతులకే 2లక్షల రూపాయలు కట్టాలి. ఇంక మా కష్టం మట్టిలో పోసినట్టే.

*–ఇస్లావత్ శంకర్, కౌలు రైతు, పోల్యానాయక్‌తండా*



సూర్యాపేటలో హాల్‌టికెట్ నెంబర్లు చూసుకుంటున్న విద్యార్థినులు

## ఇంటర్ పరీక్షలు ప్రారంభం

సూర్యాపేట అర్బన్, మార్చి 5 : జిల్లా వ్యాప్తంగా ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం పరీక్షలు బుధవారం ప్రారంభమయ్యాయి. జిల్లాలో జనరల్, ఒకేషనల్ విద్యార్థులు మొత్తం 8,779 మందికిగాను 8,254 మంది హాజరయ్యారు. వీరిలో జనరల్ విద్యార్థులు 7,217 మందికి గానూ 6,910 హాజరు కాగా 307 మంది గైర్హాజరయ్యారు. ఒకేషనల్ విభాగంలో మొత్తం 1,562 మందికి గానూ 1,344 మంది హాజరు కాగా 218 మంది హాజరు కాలేదు. జిల్లా వ్యాప్తంగా 32 పరీక్షా కేంద్రాల్లో ఎక్కడా మాల్ ప్రాక్టీస్ కేసులు నమోదు కాలేదు. పలు పరీక్ష కేంద్రాలను జిల్లా ఇంటర్మీడియట్ అధికారి భానునాయక్ పరిశీలించి మాట్లాడుతూ మొదటి రోజు పరీక్షలో బీ సెట్ పేపర్ అందించినట్లు పేర్కొన్నారు. గైర్హాజరైన విద్యార్థుల ఓఎంఆర్ స్కానింగ్‌లో సమస్య వల్ల హాజరు నమోదులో ఇబ్బందులు ఎదురైనట్లు తెలిపారు. ఇలాంటి సమస్య పునరావృతం కాకుండా చూస్తామని చెప్పారు.

### పరీక్ష కేంద్రాన్ని కలెక్టర్ సందర్శన



నెమ్మికల్ ప్రభుత్వ జూనియర్ కళాశాల పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న కలెక్టర్

ఆత్మకూర్.ఎస్ : మండల పరిధిలోని నెమ్మికల్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ పరీక్ష కేంద్రాన్ని బుధవారం కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ తనిఖీ చేశారు. ఆయన వెంట ఫ్లయింగ్ స్క్వాడ్ వీడీఎస్ ప్రసాద్, తాసీల్దార్ హరిశ్చంద్ర ప్రసాద్, అధికారులు జె.కృష్ణయ్య, జి.లక్ష్మయ్య, ఆర్ఐ ప్రదీప్‌రెడ్డి, వెంకటేశ్వర్లు ఉన్నారు.

### నల్లగొండలో..

నల్లగొండ : జిల్లాలో మొత్తం 28,722 మంది విద్యార్థులు పరీక్ష రాయాల్సి ఉండగా 11మంది గైర్హాజరు కాగా 28,711 మంది పరీక్ష రాశారు. 144 సెక్షన్ అమలు నేపథ్యంలో జిల్లాలో ప్రతి సెంటర్ వద్ద 200 మీటర్లలోపు ఎవరిని అనుమతించకపోవడంతో పాటు ఆయా ప్రాంతాల్లో జిరాక్స్ దుకాణాలను అధికారులు మూయించారు. మాస్ కాపీయింగ్ జరుగకుండా 52 మంది చీఫ్ సూపరింటెండెంట్లు, 52 మంది డిపార్ట్‌మెంట్ అధికారులు, 1,436 మంది ఇన్విజిలేటర్లు విధుల్లో పాల్గొన్నారు.



ధర్నా అనంతరం కలెక్టరేట్‌లో ఉద్యోగికి వినతిపత్రం అందిస్తున్న కిసాన్ మోర్చా నాయకులు


## ఇండ్ల స్థలాల కోసం కలెక్టరేట్ ఎదుట ధర్నా

భువనగిరి కలెక్టరేట్/ఆలేరురూరల్, మార్చి 5 : అర్హులైన నిరుపేదలకు ప్రభుత్వ భూమిలో ఇంటి స్థలాలు ఇవ్వాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు చెక్క వెంకటేశ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆలేరు మండలం కొలనుపాక గ్రామంలో సర్వే నంబర్ 8లోని రెండెకరాల ప్రభుత్వ భూమి అర్హులైన పేదలకు ఇవ్వాలని కోరుతూ బుధవారం కలెక్టరేట్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించి మాట్లాడారు. గ్రామంలో అర్హులైన పేదలు అనేక రోజుల నుంచి అద్దె ఇండ్లల్లో ఉంటూ కిరాయిలు కట్టలేక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం డబుల్ బెడ్రూం ఇండ్లు కట్టించిన దాని పక్కన ప్రభుత్వ స్థలం రెండు ఎకరాల భూమి ఉందని, గతంలో సైతం ఆలేరు ఎమ్మార్వో కార్యాలయం ముందు ధర్నా చేసి వినతి పత్రం అందజేసినా ఫలితం లేదని తెలిపారు. ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు తుంగలో తొక్కిందని మండిపడ్డారు. ప్రజా పాలనలో దరఖాస్తులు పెట్టుకున్నా అర్హులైన పేదలకు ఇంటి స్థలాలు, ఇందిరమ్మ ఇండ్లు రాలేదన్నారు. అనంతరం పలు సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని కలెక్టర్ కార్యాలయ అధికారులకు అందజేశారు.


## సాగు నీరిచ్చి రైతులను ఆదుకోవాలి

- ఎండిన వరికి ఎకరాకు రూ.30వేలు పరిహారం ఇవ్వాలి
- సంయుక్త కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట రైతుల ధర్నా

సూర్యాపేట టౌన్, మార్చి 5 : ఎస్సారెస్పీ కాల్వలకు నీళ్లు ఇచ్చి ప్రభుత్వం ఎండుతున్న పంటలను కాపాడాలని రైతులు డిమాండ్ చేశారు. ఇప్పటికే దెబ్బతిన్న వరి పంటకు సంబంధించి రైతులకు ఎకరాకు రూ.30వేలు పరిహారం ఇవ్వాలని కోరారు. మద్దతు ధర, కొనుగోళ్లతోపాటు వివిధ సమస్యలపై సంయుక్త కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో రైతులు బుధవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా సంయుక్త కిసాన్ మోర్చా జిల్లా కన్వీనర్లు మల్లు నాగార్జునరెడ్డి, మండారి డేవిడ్‌కుమార్, షేక్ నజీర్, నల్లడ మాధవరెడ్డి, నారబోయిన వెంకట్‌యాదవ్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులను నిర్లక్ష్యం చేస్తున్నాయన్నారు. నూతన వ్యవసాయ మార్కెట్ విధానాన్ని ఉపసంహరించుకోవాలని, అర్హులైన రైతులందరికీ పాత రుణాలను రద్దు చేసి కొత్తవి ఇవ్వాలని డిమాండ్ చేశారు. సన్నధాన్యం పండించిన రైతులకు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన రూ.500 నేటికీ పూర్తి స్థాయిలో అందలేదన్నారు. ఎస్సారెస్పీ కాల్వల ద్వారా సాగునీరు అందించి నూతనకల్, మద్దిరాల, ఆత్మకూర్.ఎస్, చివ్వెంల, మోతె, పెన్‌పహాడ్, మునగాల, నడిగూడెం మండలాల్లో ఎండుతున్న పంటలను కాపాడాలని కోరారు. సూర్యాపేటను కరువు జిల్లాగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. అనంతరం వివిధ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని కలెక్టరేట్ ఏఓ సుదర్శన్‌రెడ్డికి అందించారు. కార్యక్రమంలో సంయుక్త కిసాన్ మోర్చా నాయకులు వరికుప్పల వెంకన్న, బొడ్డ శంకర్, దండ వెంకట్‌రెడ్డి, మట్టిపల్లి సైదులు, ముల్కలపల్లి రాములు, పోటు లక్ష్మయ్య, పల్లె వెంకట్‌రెడ్డి, కరీం, కందాల శంకర్, మేకల కనకారావు, మెదరమెట్ల వెంకటేశ్వర్‌రావు, షేక్ సైదా, కొప్పుల రజిత, బెల్లంకొండ సత్యనారాయణ, నాగిరెడ్డి శేఖర్‌రెడ్డి, మందడి రాంరెడ్డి, వి.నర్సింహారావు, శ్రీకాంత్, సైదులు, ఉదయగిరి, కిరణ్, సాయికుమార్, మైబెల్లి ఉన్నారు.

## రికార్డులు ట్యాంపరింగ్ చేసిన ఇద్దరు గిర్దావర్ల సస్పెన్షన్

మోతె, మార్చి 5 : సూర్యాపేట జిల్లా మోతె తాసీల్దార్ కార్యాలయంలో రికార్డులను ట్యాంపరింగ్ చేసిన ఇద్దరు గిర్దావర్లను కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ సస్పెండ్ చేశారు. మోతె గిర్దావర్లుగా విధులు నిర్వహిస్తున్న జె.నిర్మలాదేవి అదనపు గిర్దావర్ షేక్ మన్సూర్ అలీ పాత పహణీ రికార్డుల్లో పేర్లు లేకపోయినా పేర్లు ఉన్నట్లు సృష్టించి ధరణిలో మిస్సింగ్ సర్వే నెంబర్లు కింద 11 దరఖాస్తులు చేయించి భూమి ఉన్నట్లు తప్పుడు ధ్రువీకరణ చేశారు. కలెక్టర్ మంగళవారం రాత్రి తాసీల్దార్ కార్యాలయానికి వెళ్లి రికార్డులు పరిశీలించగా విషయం నిర్ధారణ అయ్యింది. దాంతో రికార్డులను ట్యాంపరింగ్ చేసి ఉన్నతాధికారులను తప్పుదోవ పట్టించిన నిర్మలాదేవి, షేక్ మన్సూర్ అలీని సస్పెండ్ చేస్తూ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆ ఘటనల్లో ప్రమేయం ఉన్న ప్రతి ఒక్కరిపై తదుపరి విచారణలో చర్యలు తీసుకుంటామని కలెక్టర్ ఓ ప్రకటనలో తెలిపారు.

## ఎస్ఎల్‌బీసీ టన్నెల్ ప్రమాదంపై నిపుణులతో విచారణ జరిపించాలి

- కలెక్టరేట్ ఎదుట సీఐటీయూ ధర్నా




నల్లగొండ కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్న సీఐటీయూ నాయకులు

నల్లగొండ, మార్చి 5 : ఎస్ఎల్‌బీసీ టన్నెల్ ప్రమాదంపై నిపుణులతో సమగ్ర విచారణ జరిపించి అందుకు బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని తెలంగాణ బిల్డింగ్ అండ్ అదర్ కన్‌స్ట్రక్షన్ ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి సీహెచ్ లక్ష్మీనారాయణ డిమాండ్ చేశారు. ప్రమాదంపై సమగ్ర విచారణ జరుపాలని బుధవారం సీఐటీయూ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టన్నెల్‌లో ప్రమాదం జరిగి 11రోజులు గడుస్తున్నా కార్మికుల ఆచూకీ తెలియకపోవడం విచారకరమన్నారు. ముందుచూపు లేకపోవడం, భద్రత ప్రమాణాలు పాటించకపోవడం, ప్రభుత్వ వైఫల్యం వల్లే ఈ ప్రమాదం జరిగిందని ఆరోపించారు. ప్రమాదానికి కారణమైన కాంట్రాక్టర్‌ను బ్లాక్‌లిస్టులో పెట్టి వలస కార్మిక చట్టం ప్రకారం న్యాయం చేయాలన్నారు. కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు కంచి కేశవులు, ఉపాధ్యక్షుడు అద్దంకి నర్సింహ, పాలె సత్యనారాయణ, సైదాచారి, ఆవుట రవీందర్, కత్తుల శంకర్, వెంకన్న పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోళ్లు సజావుగా సాగేనా..?

జిల్లాలో ఇప్పటికే అనేక మండలాల్లో కరువు ఛాయలు

- పంటను కాపాడేందుకు రైతన్నల అరిగోస
- చేతికొచ్చే అరకొర ధాన్యమైనా ప్రభుత్వం సరిగ్గా కొనేనా?
- బోనస్ అందకపోవడంతో సన్నాల సాగు సున్నా

**గత యాసంగిలో జిల్లా యంత్రాంగం ఫెయిల్**

యాదాద్రి భువనగిరి, మార్చి 5 (నమస్తే తెలంగాణ) : ఎండిన చెరువులు.. వట్టిపోయిన బోర్లు, బావుల మధ్య నీటి వసతి లేక ఎండిన పంటలు పోగా.. మిగిలిన కొద్దిమొత్తాన్ని అయినా కాపాడుకునేందుకు రైతులు నానా అవస్థలు పడుతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో చేతికొచ్చే అరకొర ధాన్యమైనా సర్కారు సరిగ్గా కొంటుందా, లేదా? అన్నది సందేహంగా మారింది. గతేడాది మాదిరి రైతులను గాలికి వదిలేస్తే మరింత నష్టపోతామని రైతులు ఆందోళన చెందుతున్నారు.

పదేండ్లపాటు సుభిక్షంగా ఉన్న జిల్లా రైతాంగానికి ప్రస్తుతం అరిగోస తప్పడం లేదు. జిల్లాలో ఎన్నడూలేని విధంగా 10 మీటర్ల మేర భూగర్భ జలాలు తగ్గిపోయాయి. దాంతో బోర్లు, బావులు సైతం వట్టిపోతున్నాయి. ఎండలు మండుతుండడంతో పొట్ట దశకు వచ్చిన వరి పైర్లు కండ్ల ముందే ఎండిపోతున్నాయి. జిల్లాలోని అనేక మండలాల్లో ఇప్పటికే వేల ఎకరాల్లో పంట నష్టం వాటిల్లింది. అనేక చోట్ల రైతులు పొలాల్లో పశువులను మేపుతున్న దుస్థితి నెలకొంది. అక్కడక్కడా ఫర్వాలేదు అన్నట్టు ఉన్న పంటలకు మరో రెండు నెలలు కాపాడుకోవాల్సి ఉండగా, కొందరు రైతులు ట్యాంకర్లతో నీళ్లు తెచ్చి పోస్తున్నారు. ఇలా ఎన్నో తంటాలు పడుతూ పంటను రక్షించుకునేందుకు ప్రయత్నిస్తున్నారు.

### గత యాసంగిలో అనేక సమస్యలు

కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన ప్రారంభంలోనే 2024లో యాసంగి సీజన్ ధాన్యం కొనుగోళ్లు మొదలయ్యాయి. గతేడాది జిల్లాలో మాత్రం వడ్ల సేకరణలో ప్రభుత్వ యంత్రాంగం విఫలమైందనే ఆరోపణలున్నాయి. లారీలు, హమాలీల కొరత, తడిసిన ధాన్యం తదితర కారణాలతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నాయి. ధాన్యం కొనడంలో జాప్యం జరుగడంతో పెద్దఎత్తున ఆందోళనలకు దిగారు. రోడ్లపై ట్రాక్టర్లను అడ్డంగా పెట్టి రాస్తారోకోలు చేశారు. కలెక్టరేట్ ఎదుట, జాతీయ రహదారులపై వడ్లు పోసి నిరసన తెలిపారు. చేసేది లేక ప్రైవేట్‌లో అగ్గువ ధరకు అమ్ముకుని నష్టాల పాలైన వారూ ఉన్నారు. తడిసిన ధాన్యాన్ని అడ్డికి పావుశెరు లెక్క అప్పగించాల్సి వచ్చింది. ఈ నేపథ్యంలో ఈసారైనా ధాన్యం కొనుగోళ్లు సజావుగా సాగుతాయా అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

### సన్నాల సాగుకు రైతులు దూరం

యాసంగి సీజన్‌కు సంబంధించి జిల్లా వ్యాప్తంగా 3.19 లక్షల ఎకరాల్లో సాగు ఉంటుందని వ్యవసాయ శాఖ అంచనా వేసింది. అందులో 2.98లక్షల ఎకరాల్లో వరి, మిగతా పంటలన్నీ కలిపి 21,320 ఎకరాలు సాగు చేసే అవకాశం ఉందని భావించింది. కాగా, 2.80లక్షల ఎకరాల్లో వివిధ పంటలు వేశారు. 8లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడి వస్తుందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఇవి మొత్తం దొడ్డు వడ్లేనని తెలుస్తున్నది. వ్యవసాయ శాఖ ఇచ్చిన నివేదిక ప్రకారం ఈసారి జిల్లాలో రైతులు సన్నాలు సాగు చేయలేదు. గత సీజన్‌లో సన్న ధాన్యం వేస్తే 500 బోనస్ వస్తుందని కొంతమంది రైతులు సాగు చేసి సర్కారుకు అప్పగించారు. అందుకు సంబంధించిన బోనస్ డబ్బులు ఇప్పటికీ పూర్తిస్థాయిలో అందలేదు. ఇలాంటి పరిస్థితుల్లో రైతులు సన్న వడ్లు సాగు చేయడానికి ముందుకు రాలేదు. ఇక దిగుబడిలోనూ ప్రభుత్వం 4.5లక్షల మెట్రిక్ టన్నుల మేర కొనుగోళ్లు జరిగే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. మిల్లులు, ప్రైవేట్‌లో అమ్మకాలు, సొంత అవసరాలకు 3.5లక్షల మెట్రిక్ టన్నులు పోగా, మిగతాది కొనుగోలు కేంద్రాలకు వస్తుందని అంచనా వేస్తున్నారు. జిల్లాలో 51 మిల్లులు ఉండగా, 10 రా, 41 బాయిల్డ్ మిల్లులు ఉన్నాయి.

### 1.12 కోట్ల గన్నీ బ్యాగులు అవసరం

జిల్లాలో మరికొద్ది రోజుల్లో కోతలు షురూ కానున్నాయి. ఈ నేపథ్యంలో ధాన్యం కొనుగోళ్లకు అధికారులు ప్రణాళిక రూపొందించారు. మొత్తం 372 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. వాటిల్లో ఐకేపీ, పీఏసీఎస్‌లు, ఇతర కేంద్రాలు ఉంటాయి. ఇప్పటికే సిబ్బందికి ఒక దఫా శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. త్వరలో మరోసారి ట్రైనింగ్ ఇవ్వనున్నారు. ధాన్యానికి ప్రభుత్వం నిర్దేశించిన మద్దతు ధర దక్కాలంటే పలు సూచనలు పాటించాలని అధికారులు చెబుతున్నారు. ఏ గ్రేడ్ ధాన్యానికి క్వింటాకు రూ.2,320, కామన్ గ్రేడ్ రకానికి రూ.2,300 మద్దతు ధర కల్పించనున్నారు. జిల్లాలో మొత్తం 1.12 కోట్ల గన్నీ బ్యాగులు అవసరం కానున్నాయి. ప్రస్తుతం 80లక్షల బ్యాగులు అందుబాటులో ఉండగా, మిగతా వాటికి ఇండెంట్ పెట్టారు. జిల్లాలో 4వేల టార్పాలిన్లు ఉండగా, 11 వేలకు ఇండెంట్ పెట్టారు. ఇవి త్వరలోనే జిల్లాకు చేరుతాయని అధికారులు చెప్తున్నారు. తూకం వేసే పరికరాలు, తేమ నిర్ధారించే మీటర్లు సిద్ధంగా ఉంచేందుకు చర్యలు తీసుకుంటున్నారు.

## సాగు నీటి కోసం కిలోమీటరు నుంచి పైప్‌లైన్

- వరి పైరును కాపాడుకునేందుకు రైతు ప్రయత్నం
- చౌటుప్పల్ మండలంలో ఎండుతున్న వరి పైర్లు



చౌటుప్పల్ మండలం సప్పిడోళ్లగూడెం గ్రామంలో వరిపైరును కాపాడుకోవడానికి కిలోమీటరు దూరం నంచి పైపు లైన్ వేసుకుంటున్న రైతు సప్పిడి శేఖర్‌రెడ్డి

చౌటుప్పల్ రూరల్, మార్చి 5 : చేతికి వచ్చే దశలో ఎండిపోతున్న పంటలను కాపాడుకోలేక చౌటుప్పల్ మండలం మందళ్లగూడెం, తూర్పుగూడెం, సింగరాయచెరువు గ్రామాల రైతులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. పూర్తిగా బోర్లు, బావుల ఆధారంగా వ్యవసాయం చేసే ఈ గ్రామాల్లో భూగర్భజలాలు అడుగంటడంతో ఇప్పటికే 60 ఎకరాలకుపైగా వరి ఎండిపోయింది. నీటి వసతికి అసలే ఆస్కారం లేని రైతులు పంటను పశువుల మేతకు వదిలేస్తున్నారు. కొద్దోగొప్పో అవకాశం ఉన్న రైతులు వేలకు వేలు ఖర్చు చేయాల్సి వస్తున్నది. సింగరాయ చెరువు గ్రామానికి చెందిన రైతు సప్పిడి శేఖర్‌రెడ్డి ఐదెకరాల్లో వరి సాగు చేయగా, ఇప్పటికే మూడెకరాలు ఎండిపోయింది. మిగతా రెండు ఎకరాలైనా కాపాడుకునేందుకు కిలోమీటరు దూరంలో ఉన్న మరొక రైతు బోరు నుంచి భూమిని తవ్వి పైప్‌లైన్ వేసుకుంటున్నాడు. గతంలో ఈ సమయంలో ఎప్పుడూ ఇంత నీటి ఎద్దడి లేదని, ఈసారి ఎండ కాలానికి ముందే పంటలు ఎండిపోతున్నాయని వాపోయాడు. పెద్దకొండూరు గ్రామ చెరువు నుంచి తమ గ్రామ పరిధిలోని తోడేళ్లకుంట వరకు తవ్వితే సాగు నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం దొరుకుతుందని, ప్రభుత్వం ఈ దిశగా చొరవ చూపాలని శేఖర్‌రెడ్డి కోరుతున్నారు. ఇదే గ్రామానికి చెందిన మరో రైతు నీల రవి గతంలో ప్రతి సీజన్‌లో ఆరెకరాల్లో వరి నాటు పెట్టేవాడు. ఈసారి మాత్రం మూడెకరాల్లోనే పంట సాగు చేశాడు. అందులో రెండెకరాలు నీళ్లు లేక ఎండిపోయింది. ఉన్న ఎకరాకూ చివరి వరకు చేతికి వస్తుందో, లేదోనని రవి ఆందోళన చెందుతున్నాడు.